
# సత్యవాక్కు

క్రైస్తవ మాసపత్రిక




September 1993

# THE WORD OF TRUTH

# ఏకైక సదవకాశము

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్య వాణి" యను రేడియో కార్యక్రమముద్వారా, లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొందుచున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 15 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్య-మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. **20**/- లు మాత్రము పోస్టేజి ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి !!

**SATYA VANI**
P.O. Box 80, Sambamurthi St.,
**KAKINADA - 533 004.**

## ప్రకటన

318 క్రైస్తవ కీర్తనలు గల పుస్తకము ఇంకొకటి ఇప్పుడు లభించుచున్నది. దాని ఖరీదు రూ. **10**/- లు; పోష్టు ఖర్చులు రూ. 1-50 అదనం. వలయువారు ఈ దిగువ చిరునామాకు వ్రాయుండి :

**T. PRAKASA RAO**
Church of Christ - Bible Learning Centre,
KOMAROLE - 523 373.

Razan Electric Press, Kakinada.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor: J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 14 సెప్టెంబరు 1993 సంచిక 2

## సంపాదకీయము

### గొప్ప తీర్పు దినము

### ( The Great Judgement Day )

మానవు లందరికి తీర్పు జరుగు దినము ఒకటి యున్నదని బైబిలు బోధించుచున్నది. అది అనేక కారణముల వలన ఒక గొప్ప దినము.

1. ఆరోజు ఎప్పుడు వచ్చునో ఏ మానవుడు ఎరుగడు. అది ప్రభువు నిర్ణయించిన దినము. "మనుష్యులొక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను; ఆ తరువాత తీర్పు జరుగును" అని లేఖనములు చెప్పుచున్నవి (హెబ్రీ 9:27).

2. ఇంతకు ముందు జీవించినవారు, ఇప్పుడు జీవించుచున్నవారు, అందరు తీర్పులో యుందురు. యిది మన ఊహకు అందనిది. అయినను దేవునికి అసాధ్యమైన సంగతులు యేమియు లేవు. "ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైనను సరే,

చెడ్డదైనను సర్వేశ్వరదేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మనమందరమును క్రీస్తు న్యాయ పీఠము ఎదుట ప్రత్యక్షము కావలయునని" అపొ. పౌలు వ్రాసెను (2 కొరింథీ 5 : 10). "మనలో ప్రతివాడును తన్ను గూర్చి దేవునికి లెక్క యొప్పగింపవలెను" (రోమా 14 : 12).

3. అందరికీ దేవుడు క్రీస్తుద్వారా వాక్యమును బట్టి తీర్పు తీర్చును. "పరలోకమందు వ్రాయబడియున్న జ్యేష్ఠుల సంఘమునకును, వారి మహోత్సవమునకును, అందరి న్యాయాధిపతియైన దేవుని యొద్దకును సంపూర్ణసిద్ధి పొందిన నీతిమంతుల ఆత్మల యొద్దకును— మీరు వచ్చియున్నారని" అపొ పౌలు వ్రాసెను (హెబ్రీ 12:23). ఏథెన్సు పుర ప్రజలకు పౌలు ఇట్లు వివరించాడు: "ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను. ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు" ఎందుకనగా తాను నియమించిన మనుష్యునిచేత నీతి ననుసరించి భూలోకమునకు తీర్పు తీర్చెడి ఒక దినమును నిర్ణయించియున్నాడు. మృతులలో నుండి ఆయనను లేపినందున దీని నమ్ముటకు అందరికిని ఆధారము కలుగజేసియున్నాడు" (అపొ. కా. 17 : 30, 31). క్రీస్తు ఇట్లు చెప్పెను: "నన్ను నిరాకరించి, నా మాటలను అంగీకరింపని వానికి తీర్పు తీర్చువాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చును" (యోహాను 12 : 48).

4. మన జీవితవిధానముబట్టి, తలంపులనుబట్టి, మాటలనుబట్టి మనకు తీర్పు తీర్చబడును. క్రీస్తు ఇట్లు చెప్పెను : "సజ్జనుడు తన మంచి ధననిధిలోనుండి సద్విషయములను తెచ్చును; దుర్జనుడు తన చెడ్డ ధననిధిలోనుండి దుర్విషయములను తెచ్చును, నేను మీతో

చెప్పునదేమనగా, మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతిమాటను గూర్చియు విమర్శదినమున లెక్క చెప్పవలసి యుండును. నీ మాటలనుబట్టి నీతిమంతుడవని తీర్పు నొందుదువు, నీ మాటలను బట్టియే అపరాధివని తీర్పు నొందుదువు" (మత్తయి 12 : 35-37). ప్రకటన 21 : 12ను కూడ చదువండి.

5. దేవుడు పక్షపాతము వహించడు. దేవునికి పక్షపాతము లేదు (రోమా 2 : 11). "అన్యాయము చేసిన వానికి తాను చేసిన అన్యాయము కొలది మరల లభించును; పక్షపాతముండదు" (కొలస్స 3:25). కొర్నేలి యింటికి వచ్చిన తరువాత అపొ. పేతురు ఇట్లనెను: "దేవుడు పక్షపాతి కాడని నిజముగా గ్రహించియున్నాను. ప్రతి జనములోను ఆయనకు భయపడి నీతిగా నడుచుకొను వానిని ఆయన అంగీకరించును" (అపొ. కా. 10 : 34-35).

6. అది ఆఖరి తీర్పు. ఒకడు చనిపోయిన తరువాత దేవుని దృష్టిలో అతని పరిస్థితిని యేమియూ మార్చుకోలేడు. బంధువులు అతని కొరకు ప్రార్థించి అతని రక్షించలేరు. ఇంకొకరికి డబ్బిచ్చి ప్రార్థింప జేసినా అతని రక్షించలేరు. చనిపోయిన వానికి రెండో తరుణమంటు యేమియూ లేదు. అందువలన ఒకడు జీవించి యుండగానే సువార్తకు లోబడి మరణ పర్యంతము నమ్మకముగా యుండాలి (మార్కు 16 : 16; ప్రకటన 2 : 10).

7. ప్రభువు నీతిమంతులను నిత్య జీవములోనికిని, దుష్టులను నిత్య శిక్షకును పంపించును (మత్త 25 : 46). ఈ రెండు నిత్యము ఉంటాయి. ఇంకో మాటలో, భక్తిహీనులు, పాపులు, అవిశ్వాసులు అందరు నిత్య నరకములో పడవేయబడుదురు. అది యుగయుగములు ఉండును. యిది న్యాయమా ? ప్రేమ గలిగిన దేవుడు అట్టి పని చేస్తాడా ? దేవుని నిందించకు; ఆయన అందరిని ప్రేమించాడు. అందరు

రక్షింపబడునట్లు తన కుమారుని బలిగా అర్పించాడు. ఆయన కృపను, ప్రేమను తిరస్కరించినవాడు అతని కర్మ ననుభవింపవలసినదే. ఆయనకులోబడి నమ్మకముగా యున్న వారు ఆయనతో నిత్యము ఉండుటకు పరలోకం వెళ్తారు.

తీర్పును గూర్చి తెలిసికొని, దానికొరకు ఎల్లప్పుడు సిద్ధపడి యుందుము గాక !

—o—

## మృతుల పునరుత్థానము

## (Resurrection of the Dead)

మానవులు మరణించినను ఒకానొక దినమందు తిరిగి లేచెదరను బోధ క్రైస్తవ్యములో ప్రత్యేకమైనది. మానవు లందరు నిత్యము జీవించాలని, అమర్త్యతను సాధించాలని ఆశ కలిగిన వారని మనము ఎరుగుదుము. మానవుని ఆత్మ నిత్యము జీవించునని అనేకులు నమ్ముదురు. అయితే మరణమువలన శరీరముతో వేరు చేయబడిన ఆత్మ తిరిగి ఒకానొక దినమందు శరీరమును ధరించుకొనును అని బైబిలు బోధించుచున్నది. దీనినే మనము పునరుత్థానము లేక మృతులలో నుండి తిరిగి లేచుట యని చెప్పుకొంటూ యుంటాము.

పునరుత్థానము అను పదము 'అనస్తాసిస్' (Anastasis), అనిస్టెమి (Anistemi), ఎగైరో (Egeiro) అను గ్రీకు పదములనుండి ఉద్భవించినది. ఈ పదములు నిద్రనుండి లేపుట, లేచుట, లేపబడుట యను భావమును కలిగియున్నవి.

క్రొత్త నిబంధన గ్రంథములో మూడు ప్రత్యేక పునరుత్థాన సందర్భములను గూర్చి వ్రాయబడి యున్నది. మొదటిగా యేసును, ఆయన అపొస్తలులును చనిపోయిన వారిని లేవదీయుటను గూర్చి

వ్రాయబడిన సందర్భములు. రెండవదిగా యేసు తనకుగా తాను మృతులలో నుండి లేచిన సందర్భము, మూడవదిగా మానవులందరును మృతులలో నుండి లేచుటను గూర్చిన సందర్భము.

యేసు ఈ లోకములో యున్నప్పుడు చనిపోయిన యాయీరు కుమార్తెను, నాయీను విధవరాలి కుమారుని, లాజరును మృతులలోనుండి లేవదీసెను (మత్తయి 9 : 18-26; లూకా 7 : 11-18; యోహాను 11 : 28-46). అట్లే అపొస్తలుడైన పేతురు తబీతా అను చనిపోయిన స్త్రీని సజీవురాలనుగా లేవదీసెను (అపొ. కా. 9:36-42). అపొ. పౌలు ఐతుకు అను ఒక యౌవనస్థుడు మూడవ అంతస్తునుండి పడి చనిపోగా అతనిని లేవనెత్తెను (అపొ. కా. 20 : 8-12). అయితే ఈ సందర్భములలో మనము గమనించ వలసినది యేమంటే మృతులలోనుండి లేవదీయబడిన వీరందరు మరల మరణించుటకే లేవదీయబడిరి.

## ప్రథమ ఫలము క్రీస్తు

యేసు యొక్క పునరుత్థానమైతే అట్టిదికాదు. ఆయన మరెన్నడును మరణించకుండుటకై తిరిగి లేచెను. ఆయన చనిపోకముందే పునరుత్థానుడ నగుదునని యేసు ప్రవచించెను (మత్తయి 16 : 21). ఆయన చెప్పిన రీతిగనే చనిపోయి సమాధి చేయబడి, మూడవ దినమున తిరిగి లేచెను. అది శరీరముతో కూడిన పునరుత్థానము. ఆయన తిరిగి లేచినప్పుడు మహిమ శరీరము గలవాడాయెను.

యేసు యొక్క పునరుత్థానము యదార్థమని మనము నమ్ముటకు అనేక ఆధారములు కలవు. క్రొత్త నిబంధనలోని మొదటి నాలుగు సువార్తలు క్రీస్తు పునరుత్థానమును గూర్చి బోధించుచున్నవి. ఆయన తిరిగి లేవగా ఆయనను పాతిపెట్టిన సమాధి ఖాళీగా యుండెను. ఆ సమాధిదగ్గర దేవదూత తాను చెప్పినట్టే యేసు లేచెనని సాక్ష్య

మిచ్చెను-(మత్త 28 : 7). యేసు యొక్క అపొస్తలుల జీవితములో కలిగిన గొప్ప మార్పే ఆయన తిరిగి లేచెనని మనకు నిర్ధారణ చేయుచున్నది. క్రీస్తు చనిపోవకముందు వారందరు పిరికివారై అటు యిటు పారిపోయిరి. గాని ఆయన పునరుత్థానుడయ్యెనని సాక్ష్యమిచ్చుటలో వారేమియు జంకక తమ ప్రాణములను సయితము వారు కోల్పోయినట్లు మనము గమనించగలము. అంతేకాదు, మొదటి శతాబ్దమునుండి నేటివరకు యున్న క్రైస్తవులు ప్రతి ఆదివారమున ఆరాధనకు కూడుకొనుట, ఆరాధనలో ప్రభు రాత్రి భోజనము చేయుట యనునవి క్రీస్తు యొక్క మరణ పునరుత్థానములను సూచించుచున్నవి. యేసు ఆదివారమున మృతులలో నుండి లేచుటవలన ఆరోజుకు అట్టి ప్రాముఖ్యత కలిగెను.

యేసు క్రీస్తు మృతులలో నుండి యెట్లు లేచెనో అట్లే మానవులందరు లేచెదరని బైబిలు బోధించుచున్నది. క్రీస్తు లేచుటద్వారా అది నమ్మదగిన వాస్తవమని మనకు నిర్ధారణ చేయబడినది. "ఇప్పుడైతే నిద్రించిన వారిలో ప్రథమ ఫలముగా క్రీస్తు మృతులలో నుండి లేపబడి యున్నాడు. మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానము కలిగెను. ఆదాము నందు అందరు ఏలాగు మృతి పొందియున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రతికింపబడుదురు" అని పరిశుద్ధాత్మావేశము వలన అపొ. పౌలు 1 కొరింధి 15:20-22 లో వ్రాసెను.

ఈ పునరుత్థానము క్రీస్తు రెండవసారి వచ్చునప్పుడు జరుగును: "యేసు మృతి పొంది తిరిగి లేచెనని మనము నమ్మిన యెడల, అదే ప్రకారము యేసునందు నిద్రించిన వారిని దేవుడాయనతో కూడ వెంటబెట్టుకొని వచ్చును. మేము ప్రభువు మాటలనుబట్టి మీతో చెప్పునదేమనగా, ప్రభువు రాకడవరకు సజీవులమై నిలిచియుండు

మనము నిద్రించిన వారికంటె ముందుగా ఆయన సన్నిధి చేరము. ఆర్భాటముతోను, ప్రధాన దూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకమునుండి ప్రభువు దిగివచ్చును; క్రీస్తునందుండి మృతులైన వారు మొదట లేతురు. ఆమీదట సజీవులమై నిలచియుండు మనము వారితోకూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశ మండలమునకు మేఘములమీద కొనిపోబడుదుము. కాగా మనము సదా కాలము ప్రభువుతోకూడ ఉందుము" అని అపొ. పౌలు మరల బోధించెను (1 థెస్స 4:14-17).

## అందరు లేపబడుదురు

మృతులైన వారందరు, నీతిమంతులేమి, అనీతిమంతులేమి అందరు ఆ దినమందు పునరుత్థానులగుదురని యేసు బోధించెను. ఆయన ఇట్లు చెప్పెను: "దీనికి ఆశ్చర్యపడకుడి; ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమున సమాధులలోనున్న వారందరు ఆయన శబ్దమును విని మేలుచేసినవారు జీవ పునరుత్థానమునకును, కీడు చేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరు" (యోహాను 5 : 28, 29).

ఆ పునరుత్థాన దినమందు జీవించుచున్నవారు మార్చబడుదురు. "ఇదిగో మీకు ఒక మర్మము తెలుపుచున్నాను; మన మందరము నిద్రించముగాని నిమిషములో, ఒక రెప్పపాటున కడబూర మ్రోగగానే మన మందరము మార్పు పొందుదుము. బూర మ్రోగును; అప్పుడు మృతులు అక్షయులుగా లేపబడుదురు. మనము మార్పు పొందుదుము" అని 1 కొరింథి 15:51, 52 లో వ్రాయబడియున్నది.

## సజీవులు మార్చబడుదురు

పునరుత్థాన దినమందు సజీవులైనవారు రెప్పపాటులో మార్చబడగా మృతులైనవారు శరీరముతో కూడ లేపబడుదురు. అందుకే

"మృతులలోనుండి యేసును లేపినవాని ఆత్మ మీలో నివసించిన యెడల మృతులలోనుండి క్రీస్తు యేసును లేపినవాడు చావునకు లోనైన మీ శరీరములను కూడ మీలో నివసించుచున్న తన ఆత్మ ద్వారా జీవింపజేయును" అని రోమా 8:11 లో అపొ. పౌలు బోధించెను. మృతులైనవారు శరీరముతో లేచినను వారు మార్చబడిన శరీరముతో లేచెదరు. "మృతుల పునరుత్థానమును ఆలాగే, శరీరము క్షయమైనదిగా విత్తబడి అక్షయమైనదిగా లేపబడును; ఘనహీనమైనదిగా విత్తబడి మహిమ గలదిగా లేపబడును; బలహీనమైనదిగా విత్తబడి బలమైనదిగా లేపబడును. ప్రకృతి సంబంధమైన శరీరముగా విత్తబడి ఆత్మ సంబంధ శరీరముగా లేప బడును" అని 1 కొరింథి 15 : 42-44లో వ్రాయబడి యున్నది.

సమాధిలో పాతిపెట్టబడిన శరీరముకంటె దానినుండి లేచు శరీరము మేలైనదని దీనివలన గ్రహించుకొనగలము. లేపబడు శరీరము విత్తబడు శరీరము కంటె మార్పు జెందినదైనను అది తన రూపురేఖలను (Identity) కోల్పోవునట్టిదికాదు. మృతులలో నుండి లేచిన క్రీస్తుయొక్క శరీరము అన్ని భౌతిక అవాంతరములను దాట గలిగెను. తలుపులు వేసి యుండినను ఆయన గదిలో ప్రవేశించ గలిగెను. అంతలో కనబడి అంతలో మాయమై పోగలిగెను. మనము ఇప్పుడు కలిగియున్న భౌతిక శరీరమును దేవుడు ఈ లోకమున కనుకూలముగా సృజించెను. అట్లే నిత్యజీవితమునకు అనుకూలమగు శరీరమును ఆయన తప్పక మనకు దయచేయుగలడు (1 కొరింథి 15:36-42; రోమా 8 : 11).

కొందరు మృతుల పునరుత్థానము లేదని వాదించెదరు. అయితే అట్టివారికి అపొ. పౌలు ఇట్లు జవాబు చెప్పుచున్నాడు: మృతుల పునరుత్థానము లేనియెడల క్రీస్తు లేపబడి యుండ లేదు. అట్ల

యితే అపొస్తలులు చేసిన ప్రకటన వ్యర్థమే, సరిగదా వారు అబద్ధ సాక్షులగుదురు. క్రీస్తు లేపబడని యెడల క్రైస్తవుల విశ్వాసము వ్యర్థమే, వారింక తమ పాపములలోనే యున్నారు. అంతేకాదు క్రీస్తునందు నిద్రించిన వారును నశించిరి. ఈ జీవితకాలము మట్టుకే క్రైస్తవులు క్రీస్తునందు నిరీక్షించువారైన యెడల మనుష్యులందరి కంటె దౌర్భాగ్యులై యుందురు (1 కొరింథి 15 : 12-19).

అయితే క్రీస్తు లేపబడెను, తద్వారా మనందరము చనిపోయినను మరల లేపబడుదుము అని ఆయన నిరూపించెను. క్రైస్తవుని జీవిత నిరీక్షణ కేవలము సమాధి యొద్ద అంతమయ్యేదికాదు. సమాధి కేవలము కనిపెట్టు సమయము మాత్రమే. క్రీస్తు మరల రాగా క్రైస్తవుడు ఆయనతో నిత్యము జీవించుటకు యెదురు చూచుచున్నాడు. మిత్రుడా, నీసంగతి యేమి? యేసుక్రీస్తు ఈ ఘడియలో ప్రత్యక్షమైన యెడల నిత్యత్వమును ఎక్కడ గడుపుదువు? క్రీస్తుతో గడపాలనుకుంటే ఆయనయందు నమ్మి ఈనాడే బాప్తిస్మము పొంది మరణ పర్యంతము నమ్మకముగా యుండుము (మార్కు 16 : 16; ప్రకటన 2 : 10).

— జాషువా గూటం

— o —

## ఆరాధనలో వాద్యములు వాక్యానుసారమా?

### (Instrumental Music, Is it Scriptural in Worship?)

సంగీతం ప్రేమకు భోజ్యం (Music is the Food of Love). సంగీతం సకలజన ఆమోదం అనునానుడి విధితమే గదా! సంగీతము రెండు విధములు — (1) నిర్జీవ వస్తువులనుండి వచ్చు సంగీతము (Instrumental music), (2) జీవులనుండి వచ్చు సంగీతము (Vocal music - గాత్ర సంగీతము). పూర్వము యెహోవా దేవుడు

రెండు వెండి బూరలను చేయించమని మోషేకు ఆజ్ఞాపించెను. ఇశ్రాయేలీయుల సమాజపు కదలికల సమయమునందును, ఉత్సవ కాలములందును, దహన బలులుగాని, సమాధాన బలులుగాని అర్పించు సమయమునందు ఆ బూరలను ఊదవలెనని ఆజ్ఞాపించెను (సంఖ్యా కాం. 10 : 10). వాయిద్యములు వాయించు వారును, పాటలు పాడు వారును కలిసి యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించినట్లు లేఖనములు సాక్ష్యమిచ్చుచున్నవి (II దిన వృ. 5 : 13). దావీదు మహారాజు విస్తృతముగా వాయిద్యములు వాయించుచు నాట్యమాడుచు, బలుల నర్పించుచు తన్మయత్వంతో యెహోవా దేవునికి స్తుతులు చెల్లించు చుండెడివాడు (II సమూయేలు 6 : 14-15). అయితే యింత విస్తృతముగా వాయిద్యములను, బలులను, నాట్యములను ఉపయోగించిన దావీదు మహారాజు ఇది ఇశ్రాయేలీయులకు కట్టడ అని చెప్పి యీ విధానమును ఒక జనమునకు మాత్రము పరిమితము చేసి యున్నాడు (కీర్తనలు 81 : 1-4). అనగా అప్పటి కాలపు అన్య జనులకు యీ కట్టడ వర్తించదని గ్రహించనగును. ధర్మశాస్త్రమునకు లోనైన ఇశ్రాయేలీయులకు మాత్రము యీ విధి వర్తించుచునన్నట్లు బైబిలు చెప్పుచున్నది (ద్వితీయ 5 : 3). ఇప్పుడు భారతదేశమందు క్రైస్తవులమైన మనము ఇశ్రాయేలీయుల వంశమునకు చెందిన వారమా? ఇశ్రాయేలుతో సహపౌరులుకాక, పరదేశులును, వాగ్దాన నిబంధనలులేని పరజనులు—మీరు అని అపొ. పౌలు చెప్పుచున్నాడు (ఎఫెసీ 2 : 12). ఇశ్రాయేలుకున్న నిబంధన పరజనులమైన మనకు లేదని గ్రంధము ఘోషించుచున్నది.

## ధర్మశాస్త్ర మేమాయెను ?

ఇశ్రాయేలు కిచ్చిన ధర్మశాస్త్రము బాప్తిస్మమిచ్చు యోహాను కాలమువరకేనని యేసుప్రభువు చెప్పెను (లూకా 16:16).

క్రీస్తు సిలువ వేయబడిన తర్వాత యూదుల మీద కూడ ధర్మ శాస్త్రము మేలుబడి చేయకుండ ఆజ్ఞలతో కూడిన ఆ ఋణ పత్రి మును సిలువకు మేకులతో అంటగొట్టెను (కొలస్సీ 2 : 13-15). అప్పటి కాలపు జనులకు ధర్మశాస్త్రము వర్తించనపుడు యిప్పటి కాలపు అన్యజనులమైన మనకు కూడ ధర్మశాస్త్రము (మొదటి నిబంధన) వర్తించదు అని గ్రహించవలెను. యూదులైనవారు కూడ క్రీస్తు చనిపోయిన తర్వాత ధర్మశాస్త్రము నుండి విడుదల పొందియున్నారు (రోమా 7 : 6). ఇప్పుడు ధర్మశాస్త్రము (మొదటి నిబంధన) ఉదాహరణకే గాని క్రైస్తవ విశ్వాస జీవితమునకు కట్టడ కాదు (1 కొరింధి 10 : 11). "ధర్మశాస్త్రము విశ్వాస సంబంధమైనది కాదు" (గలతీ 3 : 12). క్రీస్తు సిలువకు ముందు అమలులో యున్న ధర్మశాస్త్ర విధులను నెరవేర్చి దావీదు మహారాజు దేవుని హృదయానుసారమైనవాడని మెప్పు పొందియున్నాడు. అయితే ధర్మశాస్త్రము దేనికిని సంపూర్ణసిద్ధి కలుగజేయ లేదు గనుక, ముందియ్యబడిన ఆజ్ఞ బలహీనమైనందునను, నిష్ప్రయోజనమైనందునను అది నివారణ చేయుటకు క్రీస్తు యేసు వచ్చి శ్రేష్ఠమైన నిరీక్షణ (అనగా క్రొత్త నిబంధన) దానివెంట ప్రవేశపెట్టెను (హెబ్రీ 7 : 18-19). గనుక క్రీస్తు సిలువ తర్వాతయున్న యూదులేమి, హెల్లేనీయులేమి (అన్యజనులు) క్రొత్తగా అమలులోకి వచ్చిన క్రొత్తనిబంధనకు బద్ధులై యున్నారు గాని ఉడిగిపోయిన మొదటి నిబంధనకు బద్ధులు కారు (హెబ్రీ 8:13). దావీదు ఒకవేళ క్రీస్తు సిలువ తర్వాత జీవించినవాడైతే తాను ముందు చేసినట్లు చేయక క్రొత్తనిబంధనను అనుసరించియే దేవునిని ఆరాధించి యుండెడివాడు. దావీదు వాయిద్యములు వాయించ లేదా అని సర్దుబాటు చేసికొను మిత్రులు పై విషయములను గమనించుదురు గాక!

# క్రొత్తనిబంధన ఆరాధన

అయిన, ఏమందుము ? క్రొత్తనిబంధన విధులు వేరైన వందుమా ? అవును - శ్రేష్టమైనవి, సులువైనవి కూడాను. అదెట్లు ? దేవునిని ఆరాధించుటకు వ్యయ ప్రయాసలతో కూడిన బలులు లేవు, హోమములు లేవు, ధూపములు లేవు, ప్రక్షాళణములు లేవు, శరీరమును కష్టపెట్టు నాట్యములు లేవు, బాహ్యసంబంధమైన ఆచారములు లేవు. "దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధించవలెను" (యోహాను 4:24). దేవునిని ఆరాధించుటలో అయిదు అంశములు యిమిడి యున్నట్లు ఆది అపొస్తలుల సంఘమును పరిశీలించిన యెడల తెలియనగును. (1) రొట్టె విరుచుట (2) ప్రార్థించుట (3) కీర్తనలు పాడుట (మత్తయి 26:26-30) (4) ప్రసంగించుట (అపొ. కా. 20 : 7), (5) చందా యిచ్చుట (1 కొరింధి 16:1-2). ఈ అయిదు అంశములలో ఒక భాగము "కీర్తనలు" పాడి ఆయనను కీర్తించుట. "ఒకని కొకడు కీర్తనలతోను, సంగీతములతోను ఆత్మసంబంధమైన పాటలతోను హెచ్చరించుచు మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు కీర్తించుడి" (ఎఫెసీ 5:19). పూర్వకాలమందు వెండి బూరలను చేయుము అని ఆజ్ఞ యిచ్చిన దేవుడు క్రొత్త నిబంధన కాలములో అట్టి వాయిద్యముల ప్రస్తావన చేయకుండా మీ హృదయములతో కీర్తనలు పాడుచు కీర్తించుడి అని ఆజ్ఞాపించియున్నాడు. అంతమాత్రము కాదు. మీరు పాడు కీర్తనలు దేవునికి మహిమ తెచ్చుటమాత్రము కాక ఒకని కొకడు పాటలతో బోధించుచు, బుద్ధి చెప్పుచు కృపాసహితముగా యుండవలెనని ఆజ్ఞకూడ యున్నది (కొలస్సీ 3:16). ఒకని కొకరికి బుద్ధి చెప్పుటకు, బోధన కలుగజేయుటకు గాత్రగానమే ఉపయోగపడును గాని వాయిద్యములు బుద్ధి, బోధనలు కలుగజేయ లేవు. అపొ. పౌలు, సీలయు చెర

సాలలో నుండి కీర్తనలు పాడుచుండగ ఖయిదీలు వినుచుండిరి. వారు పాడెడు కీర్తనల వలన నేరస్తులైన ఖయిదీలకు బోధన కలిగినందున అర్ధరాత్రివేళలో చెరసాల తలుపులు తెరవబడినప్పటికిని వారు పారిపోలేదు. అందుచేతనే అపొ. పౌలు వాయిద్యములు "నిర్జీవ వస్తువులు" అని చెప్పియున్నాడు. జీవముగల దేవుని నిర్జీవ వస్తువు లేలాగు స్తుతించగలవు? ఆత్మతో ఏలాగు ఆరాధించగలవు? నీవు ఎప్పుడూ వినని సంగీతమును ఒక వాయిద్యముమీద వాయించినపుడు అది ఏమి చెప్పుచున్నది? నీవు గ్రహించగలవా? అట్లయిన వాయిద్యముద్వారా నీకు ఏమి బోధ కల్గును?

## క్రొత్తనిబంధన సంగీతము

క్రొత్త నిబంధనను చదువునపుడు మనము ఒక విషయమును గమనించగలము. ఆనాటి క్రైస్తవులు కీర్తనలు మాత్రము పాడవలెనని ఆదేశించబడ్డారు. అంతేగాని మరేమి చేయుటకు ఆదేశములు లేవు. అపొస్తలులు కూడ గాత్రముఎత్తి పాడినట్లు మాత్రము మనము గమనించవచ్చును. క్రొత్తనిబంధనలో సంగీత ప్రస్తావన చేయబడిన తొమ్మిది స్థలములలోను కీర్తనలు పాడిరి అని యున్నది. (1) "వారు కీర్తన పాడి ఒలీవల కొండకు వెళ్ళిరి" అని మత్తయి 26 : 30 లో యున్నది. (2) మార్కు 14:26 లో కూడ అదేవిధముగా యున్నది. (3) అయితే మధ్యరాత్రివేళ పౌలును, సీలయు దేవుని ప్రార్థించుచు, కీర్తనలు పాడుచుండిరి; ఖయిదీలు వినుచుండిరి (అపొ.కా. 16 : 25). (4) నీ నామ సంకీర్తనము చేయుదును (రోమా 15 : 9). (5) ఆత్మతోను పాడుదును, మనస్సుతోను పాడుదును (1 కొరింథి 14 : 15). (6) ఒకనినొకడు కీర్తనలతోను, సంగీతములతోను, ఆత్మసంబంధమైన పాటలతోను హెచ్చరించుచు (ఎఫెసీ 5:19). (7) సంగీతములతోను, కీర్తనలతోను, ఆత్మసంబంధమైన పద్యములతోను (కొలస్సీ 3:16).

(8) సమాజము మధ్యను నీ కీర్తిని గానము చేయుదును (హెబ్రీ 2:12). (9) ఎవనికైనను సంతోషము కలిగెనా? అతడు కీర్తనలు పాడ వలెను (యాకోబు 5 : 13). సంగీత మనగా గాత్ర సంగీతమే యని భావించుట యుక్తము. ఎందుకనిన నోటనుండి వచ్చునదే బోధించి, బుద్ధి చెప్పగలదు.

## ప్రకటన గ్రంథములో వాయిద్యాలు

ప్రకటన గ్రంథమందు మూడు స్థలములలో కీర్తనలు పాడి నట్లు చెప్పబడి యున్నది. (1) ప్రకటన 5:8-10 ఇక్కడ యోహాను వీణెలు, ధూపద్రవ్యములతో నిండిన సువర్ణ పాత్రలు పట్టుకొనియున్న యిరువదినల్గురు పెద్దలను చూచినట్లు వ్రాయబడినది. ముఖ్య ముగా ప్రకటనలో చెప్పబడిన వస్తువులు, జంతువులు, దేనికో ఒక దానికి గుర్తులుగా (Symbols) చెప్పబడినవని మనము గ్రహిం చుదుముగాక. సువర్ణ పాత్రలు అని చెప్పబడెను గాని అవి నిజముగా సువర్ణ పాత్రలు కావు. అవి పరిశుద్ధుల ప్రార్థనలు. ఆలాగే వీణెలు కూడ దేనికో గుర్తులై యుండవచ్చును గాని అవి పలాన అని మనము ఊహించుట తగదు. అయితే 10వ వచనములో క్రొత్త పాట పాడు దురు అని యున్నది. వీణెలయొక్క ప్రస్తావన ఎందుకో తెలియదు. వీణెలు పట్టుకొన్నవారు వాయించకుండా యుంటారా అని ఒకవేళ ప్రశ్నించితే మనముకూడ భూలోకమును విడిచి సింహాసనాసీనుని యొద్దకు వెళ్ళినపుడు ఆ పరమందున్న విధులనే అనుసరించి అక్కడ పనులు చేయుదము. ప్రస్తుతము మనము భూమిమీద యున్నాము గనుక క్రొత్తనిబంధనకు బద్ధులమై యున్నాము. (2) ప్రకటన 14 : 2-3 వచనములలో వీణెలు ప్రస్తావింపబడి యున్నవి.-ఇక్కడ వీణానాదమును పోలియున్న స్వరము అని యున్నది గాని వీణెలు వాయించి యున్నారు అని లేదు. వీణ స్వరమువంటి మధుర స్వరమని

గ్రహించవగును. (3) ప్రకటన 15:3-4 - ఈ వచనములలో మోషే కీర్తనయు, గొఱ్ఱెపిల్ల యొక్క కీర్తనయు పాడుచున్నారు అని యున్నది. ఇంతకు మినహా క్రొత్తనిబంధనలో సంగీతమునుగూర్చి ప్రస్తావన మరెక్కడ లేదు. కీర్తన పాడిరి అనే పదము క్రొత్త నిబంధనలో పదే పదే వాడబడియున్నది గాన మనము కూడ క్రైస్తవ ఆరాధనలో కీర్తనలు పాడుటయే మన కర్తవ్యమై యున్నది. ఆ కీర్తనలకు మరేమైనను కలిపినయెడల వాక్యమును కలిపి, చెరిపెడువారమగుదుమేమో! చెప్పినదానికంటె అధికముగా చేసి శిక్ష ననుభవించినట్టి ఉజ్జాను జ్ఞాపకము చేసుకొందము. మందసము చేతితో ముట్టకూడదని ఆజ్ఞ యున్నది గాని మందసము పడిపోవునేమో యని చేతితో పట్టుకొన్నాడు ఉజ్జా. దేవుని ఉగ్రత వెంటనే అతనిని మొత్తినది (II సమూయేలు 6:7). లేఖనములయందు వ్రాసియున్న సంగతులను అతిక్రమింపకూడదు (1 కొరింధి 4:6). ఈ విషయము గమనించి క్రైస్తవ ఆరాధనలో పాడెడి కీర్తనలకు నిర్జీవమైన వాయిద్యములను జతపర్చకుండ జాగ్రత్త తీసికొనవలెను, దైవ నిర్ణయములను మించకుండ జాగ్రత్త పడవలెను.

## చరిత్రకారుల సాక్ష్యము

క్రొత్త నిబంధనలో వాయిద్యముల వాడుక యెక్కడా ప్రస్తావన చేయబడనందువల్ల ఆది అపొస్తలులు ఆది సంఘములో వాటిని వాడియుండరని గ్రహించవగును. దీనికి యీ దిగువ సాక్షి సమూహము ఏమి చెప్పుచున్నదో వినుము.

బైబిలు కోవిదులు, చరిత్రకారులు ఆది సంఘములో వాయిద్య సంగీతము అలవాటులో లేదని ఒప్పుకొనుచున్నారు. అమెరికాలో యున్న కొలంబియా యూనివర్సిటీకి చెందిన ప్రఖ్యాతి గాంచిన సంగీత అధ్యాపకుడు డాక్టరు కర్టుసాచ్ యీ విధముగా అంటున్నారు:

ప్రాచీన క్రైస్తవులు గాత్ర సంగీతమే వాడేవారు, మరియొక పండితుడు డాక్టరు ఫ్రెడిరిక్ రిట్టర్ తాను వ్రాసిన History of Music from Christian Era to the Present time అనే పుస్తకములో యిలా వ్రాసారు— ఆది క్రైస్తవ సమాజములలో స్వచ్ఛమైన గాత్ర సంగీతమే వాడేవారు. సంఘ చరిత్రనుబట్టి చూస్తే ప్రాథమిక క్రైస్తవులు వాయిద్య సంగీతమును వాడేవారు కాదని రుజువు అవుతుంది అని జె. యమ్. బ్రాన్ వ్రాయుచున్నారు. The History of Music, Vol. I, page 177 లో ఎమిల్ నామాన్ యీ విధముగా వ్రాయుచున్నారు— ఏ సందేహము లేకుండా ప్రథమములో దైవారాధన గాత్ర సంగీతముతోనే జరిగేది. ఆది సంఘము పట్టి కీర్తనలనే పాడెడివారు అని సంఘ పితామహులైన (Church Fathers) యూసెబస్, తెర్తుల్లా, క్రిసోస్తం, జస్టిన్ మార్టియర్ చెబుతున్నారు. ఆది అపొస్తలుల ద్వారా నడిపింపబడిన తొలి క్రైస్తవులు వాయిద్య సంగీతమును సంఘ ఆరాధనలో వాడెడి వారు కారు అని చరిత్రకారులు తెలియపర్చుచున్నారు.

అట్లయిన యిప్పటి క్రైస్తవ సంఘములలో ప్రబలుచున్న కల్తీకి కారణమేమి ? క్రైస్తవ సంఘములలోనికి వాయిద్య సంగీతము ఎప్పుడు, ఏలాగు చోటు చేసుకున్నది ? సంఘ చరిత్రనుబట్టి చూస్తే మూడవ శతాబ్ధ ప్రాంతమున ఆది అపొస్తలుల సంఘము యొక్క నిఖార్సు నీరుగార ప్రారంభించినది. అపొ. పౌలు 1 తిమోతి 4 : 1-2 వచనములలో వ్రాసినట్లు-అయితే కడవరి దినములలో కొందరు అబద్ధికుల వేషధారణవలన మోసపరచు ఆత్మలయందును దయ్యముల బోధ యందును లక్ష్యముంచి, విశ్వాస భ్రష్టులగుదురని ఆత్మ తేటగా చెప్పుచున్నాడు. నిజమైన వాక్య మార్గమునుండి సంఘము అనేక విషయములలో వైదొలగి పోయినది. ఆది అపొస్తలులు యేర్పర్చిన సామాన్యమైన స్వచ్ఛంద ఆరాధనకు అనేక అలంకారములు కల్పించి

ఆరాధనను మానవ యిచ్ఛలకు ఆస్పదముగా చేయుట ఒక భ్రిష్టత్వము. దాదాపు 670 A D. ప్రాంతములో పోపు విటాలియన్ అను ఆయన మొట్టమొదటిసారిగా ఆర్గన్‌ను సంఘములోనికి ప్రవేశపెట్టి యున్నాడు అని **American Cyclopedia** తెలియజేయుచున్నది. అప్పటి క్రైస్తవులు (కేథలిక్కువారే) ఆర్గన్‌ను సంఘములోనికి ప్రవేశముగా ప్రవేశపెట్టి నప్పుడు నిరసనచూపి యున్నారు. అందువల్ల సంఘము చీలిపోయినది. 13వ శతాబ్దమున నివసించిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కేథలిక్కు వేదపండితుడు థామస్ అక్వినాస్ అను ఆయన సంఘములో ఆర్గన్ ఉపయోగించుట కూడనిపని అని వ్రాసి యున్నాడు. దీనిని బట్టి చూస్తే 13వ శతాబ్దము వరకు సంఘములో వాయిద్యములు వాయించుట తగవులాటకు కారణముగా యుండినట్లు కనబడుచున్నది.

## మతశాఖల నాయకుల సాక్ష్యం

15వ శతాబ్ద అనంతరం మత విప్లవములు చెలరేగినవి. విప్లవ నాయకులు వారివారి శాఖ లేమైనప్పటికిని వాయిద్య సంగీత విషయములో మాత్రము ఏకీభవించి, తీవ్ర అభ్యంతరము వెలిబుచ్చి వారున్నంతకాలము వారివారి మతశాఖల సంఘములలో వాయిద్యములను బహిష్కరించిరి. లూథరన్ మిషను స్థాపనకు కారకుడైన మార్టిన్ లూథర్ యీ విధముగా చెప్పుచున్నాడు - "సంఘములో ఆర్గన్ బయలు దేవత చిహ్నము". లూథరు యొక్క అనుచరుడైన డాక్టరు కాల్‌స్టాట్ విట్టెన్‌బర్గు పట్టణములో "వాయిద్యములు సంఘములో వాయించకూడదు, చిత్రములను వ్రేలాడదీయకూడదు, శిలలను నిలువబెట్టకూడదు" అని గట్టిగా బోధించెను (**Frederic Nohl's Martin Luther - Hero of Faith**). ప్రెస్‌బెటేరియన్ మతశాఖ నాయకుడైన జాన్ కాల్విన్ యీ విధముగా నుడివెను:

ధూపము వేయుట, దీపారాధన చేయుట, మొదలగు ధర్మశాస్త్ర ఛాయలను పునరుద్ధరించుటతో సమానము సంఘములో వాయిద్యములను ఉపయోగించుట. 1562 లో Anglican Church లో సగముకంటె ఎక్కువమంది సంఘములోనుండి వాయిద్యములను బహిష్కరించవలెనని తీర్మానము చేసిరి (Hetherington's History of the Westminister Assembly of Divines) క్రైస్తవ్యము పోపుల అవినీతినుండి శుభ్రపడి, వాయిద్యములు లేకుండా గాత్రగానముతో కూడిన సామాన్య ఆరాధనకు తిరిగి రావలెనని జాన్ నాక్స పిలుపు నిచ్చెను.

మెథడిస్టు మతశాఖ నాయకుడైన జాన్ వెస్లీ యొద్దకు ఒక సంఘ సభ్యుడు వచ్చి, అయ్యా ! నేను సంఘమునకు ఒక ఆర్గన్ బహుమానముగా యివ్వాలనుకుంటున్నానని చెప్పెను. అప్పుడు జాన్ వెస్లీ ఆ సభ్యునికి యీ విధముగా జవాబిచ్చియున్నాడు - మంచిది, తీసుకొనరమ్ము కాని దాని స్వరము సంఘములో వినబడుటకు వీల్లేదు, అది కనబడుటకు వీల్లేదు. (Clark's Commentary by Adam Clark). గత శతాబ్దములో పేరు ప్రఖ్యాతులుగాంచి బోధకులలో యువరాజు అని పేరుపొందిన చార్లెస్ స్పర్జన్ మెట్రోపోలిటన్ టేబెర్నికల్ అను తన విశాలమైన సంఘములోనికి వాయిద్యములను చేరనియ్యలేదు. సంఘ ఆరాధనలోనికి వాయిద్యములను రానిచ్చుట యంత్రముల నుపయోగించి దేవునికి ప్రార్థన చేయుటతో సమానము అని స్పర్జన్ వ్యాఖ్యానించెను. ప్రఖ్యాతిగాంచిన మెథడిస్టు వేద పండితులు Adam Clark యీ విధముగా వ్రాయుచున్నాడు: నేను వృద్ధుడను. వృద్ధ బోధకుడను. దేవునిని ఆరాధించుటలో వాయిద్యములు ఎప్పుడైనా, యేమైనా మంచిని సాధించినట్లు నాకు యెరుక లేదు; పైపెచ్చు వాటిద్వారా సంఘములో చెడుగు జరిగినట్లు నాకు

దృఢనమ్మకము. సంగీతము ఒక విజ్ఞానము. అదంటె నాకెంతో ప్రీతి. దానిని ఘనపర్చు తాను కాని దేవుని యింట్లో వాయిద్యమంటే నాకు పరమ అసహ్యము. వాయిద్యము శరీరములో ఉద్రేకమును కలుగజేయును (Emotion). దురాత్మను సహితము లోబర్చుకొనగల శక్తిగలదని దావీదు నిరూపించియున్నాడు. దావీదు వాయిద్యములు వాయించుచు తన శరీరము సహితము మరచిపోయినట్లు లేఖనము సాక్ష్యము. గనుక వాయిద్యములు దేవునిని ఆరాధించలేవు సరిగదా సంఘములో బలహీన విశ్వాసులను దేవునికి దూరస్థులనుగా చేయును.

## అజ్ఞను అతిక్రమించ వద్దు

ప్రియ చదువరీ! గమనించితివా ఆరాధనలో వాయిద్యములను క్రొత్త నిబంధన ఒప్పుకొనదని; అది అపొస్తలులు ఉపదేశించని వెర్రి బోధయని; Church Fathers ఆమోదించని అర్ధరహిత అలవాటని; పలుమత శాఖ నాయకులు విసర్జించిన విపరీత ఆచారమని గుర్తించితివా? అయితే యీ అలవాటు ఆచారమై మన పితామహులనుండి జారి మనలో జీర్ణించి యున్నది. విడిచిపెట్టుట కష్టసాధ్యము. చిరుత పులి తన మచ్చలను మార్చుకొనగలదా? లేఖనములను అతిక్రమించుట ముని కోలలను యెదురు తన్నుటయే. ఆరాధనలో వాయిద్యములను ఉపయోగించుట చెరగని కళంకము, ఆజ్ఞను అతిక్రమించు ఆచారము. ఆఖరు దినములలో మనమున్నాము. ప్రభువు వచ్చుసరికి సంఘములో కళంకమైనను, ముడతయైనను ఉండకూడదని ప్రభువు కోరుచున్నాడు. ఇన్నాళ్లు మచ్చలతోను ముడతలతోను దేవునిని ఆరాధించితివి. ఇకనైనను మేలుకొని కళంకమును కడుగుకొని, ముడుతలను చదునుచేసుకొనుము. పితరులనుండి వచ్చిన ఆచారమును విడిచిపెట్టలేక యుండవచ్చును కాని పితృ పారంపర్యమైన వ్యర్థ ప్రవ

_ర్తన నుండి మనలను విడుదల చేయుటకు క్రీస్తు అమూల్య రక్తమును చిందించి యున్నాడు (1 పేతు 1 : 18). ప్రియుడా ! అమూల్య రక్తమును కాలిక్రింద వేసి త్రొక్కుదువా ? లేఖనముల తట్టు తిరుగవా ? సత్యమును గుర్తించవా ? అనుసరించవా సత్యవాక్కును ? తగ్గించుకొనుము. ధన్యుడవు కమ్ము.

—డి. యల్. హెన్రీ, విశాఖపట్నం.

—o—

## అ వ లో క న

మతశాఖల కార్ఖానాలో
మలిన సిద్ధాంతాల మూసలో
మలచబడిన పాష్టరోత్తమా
వాస్తవాన్ని పరిశీలించుమా

క్రీస్తు మాటలో సమత యున్నది
మానవతకు అదే అర్థమైనది
దైవమానవ సంగమం సంఘమైనది
రక్షింపబడిన వారికి రాజ్యమైనది

స్వనీతికన్నా దైవనీతి గొప్పది
మతముకన్నా మమత గొప్పది
మమత నిండిన మనస్సు గొప్పది
సత్యమెరిగిన బ్రతుకు గొప్పది

పురెక్రిక పుట్టిన బుద్ధులు వ్యర్థం
పునాది లేని కట్టడం శిథిలం
శిరస్సు లేని శరీరం మృతం
క్రీస్తు లేని సంఘం భంగం

—యస్. జె. మేడిది, కొణితివాడ-534 240.

— o —

## దేవునికి విధేయత చూపుట
## ( Obedience to God )

విధేయత అనుమాట అధికారులకు లోబడి యుండుటను సూచించుచున్నది. క్రైస్తవ్యములో యేసు ప్రభువుకు సర్వాధికారమున్నది (మత్తయి 28 : 18-20). క్రీస్తుకు లోబడుట అంటే ఆయన యిచ్చిన ఆజ్ఞలకు నియమములకు పూర్తిగా లోబడి యుండుట యని అర్థము. యివి క్రొత్తనిబంధనలో కన్పడతాయి (హెబ్రీ 9 : 15).

విధేయతకు త్యాగం అవసరం. దేవునికి లోబడియుండుటకు యేసుప్రభువు కొన్నాళ్ళు పరలోకం విడిచి భూమి మీదకు రావలసి వచ్చింది. పరలోక పిలుపునకు లోబడుటలో మన ప్రభువు హింసింప బడ్డారు, హేళన చేయబడ్డారు, అవమానం భరించారు. ఆయన మర ణము పొందునంతగా విధేయత చూపించారు (ఫిలి 2 : 8). మనకు రక్షణను తెచ్చుటకు యేసు దేవునికి లోబడినందున, రక్షింపబడ డానికి మనం క్రీస్తుకు సంపూర్తిగ లోబడుట అవసరం. సర్వాధి కారము కలిగియున్న క్రీస్తు తనకు విధేయులైన వారికి మాత్రమే నిత్యరక్షణకు కారకుడు (హెబ్రీ 5 : 10).

దేవునికి లోబడుటలో అపో. పౌలు కూడ త్యాగం చేసాడు. అతడు తన పూర్వమతాన్ని విడిచిపెట్టాడు. అయితే మనం చేసే త్యాగాని కంటే, పొందే ఆశీర్వాదములే హెచ్చయినవి (2 తిమో 4 : 6-8). సౌలు యొక్క మతము దేవునికి అంగీకార యోగ్యమైనది కాదని అతడు ఎప్పుడు గ్రహించాడో, వెంటనే అతడు దాన్ని త్యజించి దేవునికి పూర్తిగా లోబడ్డాడు. మనము కూడ దేవునికి ఆమోదము కాని సంఘాల్లో, మతాలలో యుంటే వాటిని వెంటనే విసర్జించి ఆయ నకు లోబడాలి (మత్త 15 : 9).

దేవునికి బలులు అర్పించుట కంటె విధేయత చూపుట శ్రేష్టము. రాజైన సౌలు ఈ ప్రాముఖ్య సూత్రాన్ని గ్రహించలేనందువలన అతడు ఇశ్రాయేలుపై తన రాజరికాన్ని కోల్పోయాడు. ప్రవక్త యైన సమూయేలు అతనికి ఇట్లు చెప్పాడు: "తాను సెలవిచ్చిన మాటను ఒకడు గైకొనుట వలన యెహోవా సంతోషించునా? ఆలో చించుము, బలులు అర్పించుట కంటె ఆజ్ఞను గైకొనుటయు, పొట్టేళ్ళ క్రొవ్వు అర్పించుట కంటె మాట వినుటయు శ్రేష్టము" (I సమూ

యేలు 15 : 22). విధేయతకు బదులుగా బలులు, బహుమానములు పనికి రావని సౌలు త్వరలో నేర్చుకొన్నాడు.

విధేయత ఒక విశ్వాస క్రియ (హెబ్రీ 11 : 8). మనం మానవుల కంటె దేవునికి విధేయత చూపాలి (అపో.కా. 5 : 29). సత్యమునకు విధేయులవుటవలన మన ఆత్మలు పవిత్ర పరచబడును (1 పేతురు 1 : 22). విధేయతకు ప్రేమ, వినయం, అణకువ అవసరం. దేవుని చిత్తాన్ని తెలిసికొనుటకు మనం లేఖనములను పరిశోధించి, ఆయన చిత్తానికి అందరము లోబడుదుముగాక.

— ఆర్వెల్ కర్టిస్ (TWE)

---

## ఆత్మీయంగా పెరుగుట
## (Growing Spiritually)

ఒక శిశువు బరువులోను, పొడవులోను, జ్ఞానంలోను దినదినం పెరుగుచున్నట్లే క్రైస్తవుడు ఆత్మీయంగా పెరగాలి, బలము పొందాలి. "క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై నిర్మలమైన వాక్యమను పాలవలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము ఆ పాలను అపేక్షించుడి" యని పేతురు హెచ్చరించాడు (1 పేతురు 2 : 2). శిశువు పెరుగుటకు ముందు పాలను, ఆ తరువాత స్వల్ప ఆహారమును ఎట్లు భుజించునో అట్లే ఆత్మీయాభివృద్ధి కొరకు క్రైస్తవులు దేవుని వాక్యమును దిన దినము జీర్ణించుకోవాలి.

క్రైస్తవులు దిన దినము ఆత్మీయముగా పెరుగుటకు నిశ్చయించుకోవాలి. పౌలు ఇట్లు వ్రాసాడు : "శరీరానుసారమైన మనస్సు మరణము; ఆత్మానుసారమైన మనస్సు జీవమును, సమాధానమునై యున్నది" (రోమా 8 : 6). కొందరు ప్రజలు ఎంతకాలము జీవించినను క్రీస్తులో యున్న శాంతిని కనుగొనలేరు. "కాబట్టి విశ్వాస

మూలమున మనము నీతిమంతులముగా తీర్చబడి, మనప్రభువైన యేసుక్రీస్తు ద్వారా సమాధానము కలిగియుందము" (రోమా 5:1). మనకు సమృద్ధియైన జీవము నిచ్చుటకు యేసు ఈ లోకమునకు వచ్చెను (యోహాను 10 : 10). ఆ జీవమును ఆయన లేఖనములలో మాత్రము మనము కనుగొనగలము. ఆయన వాక్యాన్ని పఠించక పోతే ఆయన యిచ్చు జీవాన్ని సమాధానమును ఎట్లు కలిగియుండ గలము ?

క్రైస్తవులలో పెక్కుమంది స్వల్పవాక్య జ్ఞానముతో సంతృప్తి జెందుతారు. వారి జ్ఞానము సంకుచితం గనుక దినదినము బలహీను లౌతారు. ఆహారము లేకుండా ఒకడు ఎక్కువ దినాలు ఎట్లు బ్రతుక లేడో, అట్లే దేవుని బిడ్డయైనవాడు వాక్యాహారము లేకపోతే బల హీనుడవుతాడు. వాక్యాన్ని పఠించకపోయినా, ఆరాధనలకు గైరు హాజరయినా అట్టి క్రైస్తవుడు ఆత్మీయ రుగ్మతను కలిగినవాడ వుతాడు. దేవుని వాక్యము పాపము చేయకుండా మనకు సహాయ పడతాది. "నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయ ములో నీ వాక్యము ఉంచుకొని యున్నాను" (కీర్తన 119 : 11). దివారాత్రులు సంతోషముతో గదుపుటకు అది మనకు మంచి ఆలో చనల ననుగ్రహించును (కీర్త 1 : 1, 2). మన జీవితాన్ని మంచి సంగతులతో అది నింపును. "నీతికొరకు ఆకలి దప్పులు గలవారు ధన్యులు వారు తృప్తి పరచబడుదురు" (మత్తయి 5 : 6).

కల్తీ పదార్థములను తినుటవలన మన శరీరాలకు కలుగు హానిని మనం ఎరుగుదుము. ఏతల్లి అయినా తన బిడ్డలకు కల్తీ ఆహారాన్నిస్తే ఆమె చాల నిర్లక్ష్యం గల స్త్రీ అని పిలువబడును. అయితే మన సమయాన్నంతా T. V. చూచుటకు, సినిమాలకు, అశ్లీల మేగజైను లకు, పత్రికలకు మనం వెచ్చించితే శారీరకంగాను, ఆత్మీయంగాను

మనం నిర్లక్ష్యం గలవారమైతే, ఆత్మీయంగా మనకు బలమునిచ్చు దేవుని వాక్యాన్ని మనం నెమరువేయాలి, జీర్ణించుకోవాలి. మనం దినదినం వాక్యాన్ని చదువుచు, దాన్ని బట్టి జీవించుచు మన బిడ్డలను కూడ దైవమార్గములో నడించుదుముగాక.

— డాన్ విలియమ్స్, U.S.A.

---

## సంక్షిప్త వార్తలు

ఆగష్టు నెల సువార్తికుల సదస్సు 26వ తేదీన అమలాపురం (జానకిపేట) క్రీస్తు సంఘము ఆరాధించే అతి విశాలమైన భవనములో అత్యంత ఆశీర్వాదకరంగా జరిగెను. అనేక జిల్లాలనుండి తరలి వచ్చిన సుమారు 200 మంది సువార్తికుల సమక్షంలో సువార్తికుని పని యేమి? వాని బాధ్యతలేవి? అను అంశము చర్చింపబడెను.

ఉదయం ప్రారంభమైన సమావేశమునకు సోదరులు జాషువా గూటంగారు అధ్యక్షత వహించిరి. సోదరులు బొంతు ధనరాజుగారు, పాల్ గూటంగారు, R.Ch. సద్గుణరావుగారు మరియు అధ్యక్షులు చర్చలో పాల్గొనిరి. మధ్యాహ్న సమావేశములో సోదరులు పి. ప్రకాశంగారు, వి. చిన్నయ్యగారు, టి. జ్ఞానానందంగారు, నెహెమ్యా గూటంగారు మరియు అధ్యక్షులు పై అంశముపై చక్కని వర్తమానమును అందించిరి.

"సువార్త ప్రకటించు వారి పాదములెంతో సుందరమైనవి" (రోమా 10 : 15) అని పౌలు వ్రాసిన వచన భాగాన్ని చదివితే అతడెంత గొప్ప పనిని దేవుని దృష్టిలో కలిగి యున్నాడో గ్రహించగలం. సువార్త ప్రకటించువారే సువార్తికులు. అతని పని సామాన్యమైనది కాదు. అతడు దేవుని సంకల్పమును లోకమునకు ప్రకటించి మానవులు రక్షింపబడి దేవుని రాజ్య నివాసులగునట్లు సరిచేసిన ఆత్మల

యెడల శ్రద్ధ కలిగి యున్నాడు. అతడు మంచి సైనికునిగా, వ్యవసాయ దారుడుగా, యోగ్యుడైన పనివానిగా, యోగ్యమైన పాత్రగా మరియు దేవుని సేవకునిగా తన పనిని చేయుటలో సమయము, అసమయము అనే భేదం ఎరుగనివాడై యున్నాడు. సువార్త విషయంలో సిగ్గుపడక శ్రమపడి పని చేయుచు సిద్ధమనస్సు అను జోడు తొడుగుకొని అపవాదిపై అవిరామ పోరాటము జరిగించుచున్నవాడు. భూమిమీద యింత గొప్ప పని కలిగియున్న వారెవరును లేరు.

సువార్తికుని పనిచేసే బాధ్యతను దేవుడు మనుష్యులకు అప్పగించెను. ఈ పని దేవదూతలకు అనుగ్రహింపబడలేదు.

అతడు సంఘమునకు వాక్యమును బోధించి వారు క్షేమాభివృద్ధి నొందునట్లు ప్రయాసపడి అర్హతగల పెద్దలను నియమించు బాధ్యతను కలిగియున్నాడు. మాటలో, ప్రవర్తనలో, ప్రేమలో, విశ్వాసములో, పవిత్రతలో మాదిరి కలిగినవాడై (1 తి 4:12) ఆయన రాజ్య విస్తరణను గూర్చిన బాధ్యత కలిగియున్నాడు. అతడు చదువుట యందును, హెచ్చరించుట యందును, బోధించుట యందును జాగ్రత్త కలిగి యుండాలి (1 తిమో 4:13).

ఒక ఆత్మ లోకమంతటికంటె విలువ కలిగినదయితే (మత్త 16:26) ఆ ఆత్మను సంపాదించు సువార్తికుని పని ప్రశంసనీయమైనది. సువార్త ప్రకటించుటకు ఫిలిప్పు పరుగెత్తుకొని పోయినట్లు వ్రాయబడింది (అ. కా. 8 : 30). యిది అతని ఆసక్తికి నిదర్శనం. అట్టి ఆసక్తి సువార్తికులు కలిగియుండాలని హెచ్చరించిరి.

అమలాపురంలో జరిగిన సదస్సుకు సోదరులు ధనరాజుగారు, స్థానిక సంఘస్థులు చక్కటి ఏర్పాట్లు చేసిరి. సాయంకాల కూటము ధనరాజుగారి వందన సమర్పణతోను, Bro. స్టీవెన్సన్‌గారి ప్రార్థనతోను ముగిసెను. ఈ వర్క్‌షాప్‌కు హాజరైన ప్రతివారు ఆనంద హృదయాలతో తమతమ గృహాలకు తరలి వెళ్ళిరి.

సెప్టెంబరు నెల సువార్తికుల సదస్సు 22వ తేదీ బుధవారం పశ్చిమ గోదావరి జిల్లా, కొవ్వూరు మండలంలో యున్న ఆరికిరేవుల గ్రామంలో Bro. ఎ. విశ్వేశ్వరరావుగారి ఆధ్వర్యమున జరుగును.

——

అక్టోబరు 25 నుండి 30 వరకు ఆహ్వానితులైన సువార్తికులకు ప్రత్యేక బైబిలు తరగతులు కాకినాడలో జరుగును. దీనిలో Bro. Gene Cloer గారు, మరో ముగ్గురు అమెరికా సోదరులు వాక్యోపదేశము గావించెదరు.

1993 డిశంబరు రెండవ వారములో కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ ఆధ్వర్యమున బైబిలు సెమినార్ జరుగును. దీనిలో పెర్రి కోతమ్ గారు తదితరులు వాక్యోపదేశము గావింతురు. ఆయా కార్యక్రమములకై ప్రార్థించ మనవి.

---

Regd. No. H/KD—45/KD H.O.

From
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No. ........................

To ........................
........................
........................
........................